

వంతెన లేక.. వానాకాలంలో పాట్లు

- దశాబ్దాల కల నెరవేరని వైనం
- చింతలగెడ్డ పొంగితే పది గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు

6లో



పక్కాగా భూముల రీసర్వే

- జిల్లా ప్రత్యేకాధికారి శ్రీనివాసులు రెడ్డి


గరుగుబిల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామాల్లో మూడో విడత రీసర్వేను పక్కాగా చేపట్టాలని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రత్యేకాధికారి (డిప్యూటీ డైరెక్టర్, మంగళగిరి) టి.శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. గురువారం తోటపల్లిలో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోపాలు లేకుండా భూముల రీ సర్వే చేపట్టాలన్నారు. గతంలో నెలకొన్న తప్పులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పలు గ్రామాల పరిధిలోని రీసర్వే క్షేత్రస్థాయిలో సిబ్బంది తీరుపై పిర్యాదులు అందాయని తెలిపారు. సర్వేకు ముందు గ్రామస్థాయిలో దండోరా వేయించి (మిగతా 8వ పేజీలో...)



సీతంపేట రూరల్ : భూ రీసర్వేను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి శ్రీనివాసులు రెడ్డి

పోలి పాడ్యమికి సిద్ధం

- తోటపల్లిలో ఏర్పాట్లు పూర్తి



భక్తుల స్నానాల కోసం నాగావళి నదీ తీర ప్రాంతాన్ని చదును చేసిన దృశ్యం

గరుగుబిల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవాలయాలు పోలిపాడ్యమి పూజలకు సిద్ధమయ్యాయి. శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తీకమాసం ముగింపు కావడంతో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు నాగావళి నది తీరంలో స్నానాలు ఆచరించి.. దీపాలు వెలిగించనున్నారు. నదికి హారతులు ఇచ్చిన తర్వాత స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ నేప థ్యంలో భక్తజనం రద్దీ దృష్ట్యా దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఈవో బి.శ్రీనివాస్, ఎస్‌ఐ ఫకృద్దీన్ తెలిపారు. సుమారు పది వేలకు మించి భక్తులు రానున్నారని, తోపులాటలు జరగ కుండా సాఫీగా స్వామి దర్శనం అయ్యేలా చర్యలు చేపట్టా మన్నారు. ఇకపోతే నాగావళి నది వద్ద స్నానపు గదులు, టెంట్లు సిద్ధం చేశారు. ఎటు వంటి ప్రమాదాలు జరగ కుండా ఆ ప్రాంతంలో పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయరాదని సంబం ధిత అధికారులకు సమాచారం అం దించారు. అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ సిబ్బందితో పాటు సుమారు 300లకు పైగా శ్రీవారి సేవకులు ఈ వేడుకల్లో భాగస్వాములవనున్నారు. మరోవైపు ఆలయ సిబ్బంది లడ్డూల తయారీలో నిమగ్నమయ్యారు.





తోటపల్లి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఏజెన్సీలో ముమ్మరంగా వాహన తనిఖీలు 6లో

కేంద్ర ప్రభుత్వ పథకాల **అమలుపై ఆరా**

జాతీయస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు **ఉపాధ్యాయురాలు** 6లో

డ్రంకెన్ డ్రైవ్ కేసులో **ఇద్దరికి జైలు** 7లో

సెస్ వసూలు కాక.. **సౌకర్యాలు లేక**

- శాఖా గ్రంథాలయంలో అందుబాటులో లేని పుస్తకాలు 7లో



ఆశాజనకంగా..!

- జిల్లాలో చేపల పెంపకం
- గతంతో పోలిస్తే మెరుగ్గా ఉత్పత్తి
- మరింత ప్రోత్సహిస్తే ఎంతో మేలు
- నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం



తోటపల్లి కుడి ప్రధాన కాలువలో చేపలు పడుతున్న మత్స్యకారుడు

పార్వతీపురం/గరుగుబిల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద ఉత్పత్తికి మన్యం జిల్లా ఎంతో అనుకూలం. అందుకే గతంతో పోలిస్తే సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల్లో చేపల పెంపకం పెరిగింది. ఉత్పత్తి ఆశాజనకంగా ఉంది. మత్స్యకారులకు కూడా ఉపాధి లభిస్తోంది. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తగిన సహకారం అంది స్తున్నాయి. అనేక పథకాలు, సబ్సిడీలు అమలు చేస్తున్నాయి. నేడు ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఏటా తోటపల్లి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ జలాశయాల్లో మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను విడిచిపెడుతున్నారు. వాటి పెంపకం, విక్రయాల బాధ్యతను స్థానిక గిరిజన మత్స్యకారులకు అప్పగిస్తున్నారు. ఈ ఏడాదిలో తోటపల్లి, వెంగళరాయసాగర్ ప్రాజెక్టుల్లో 14 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. ఏడాదికి మత్స్య సంపద 19 వేల మెట్రిక్ టన్నులుగా నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా మన్యంలో 800 వరకు చెరువులు ఉండగా.. ఐటీడీఏల ద్వారా చేప పిల్లల పెంపకం చేపడుతూ గిరిజన మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇవి కాకుండా మరో 110 చెరువులు ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో 285 ఎకరాల్లోని 85 చెరువుల్లో చేపల పెంపకం సాగుతుంది. ఈ ప్రాంతంలో బొచ్చు, రాగండి, పెదమయిలు, ఎర్రమ యిలు, రూప్‌చంద్, కొర్ర మయలు, రొయ్యలతో పాటు నలుపు రకం చేపలు లభిస్తున్నాయి. సుమారు 20 వేల మంది మత్స్యకారులు ఉండగా.. రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 186 మత్స్యకార గ్రామాలున్నాయి. 47 మత్స్య కార సంఘాల ద్వారా ప్రాజెక్టులు, చెరువుల్లో లభ్యమ య్యే చేపలను వివిధ ప్రాంతాల్లో విక్రయి స్తున్నారు. ఒడిశాకు కూడా ఎగుమతి చేస్తున్నారు. కాగా జిల్లాలో లభ్యమయ్యే మత్స్య (మిగతా 8వ పేజీలో...)

హాస్టల్ గదుల అపరిశుభ్రతపై

సబ్ కలెక్టర్ అసహనం

పాలకొండ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): పాలకొండలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం రాత్రి సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే వసతిగృహ గదులు అపరిశుభ్రంగా ఉండడంపై అస హనం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్య లు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నాణ్యమైన మెనూతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చొరవ చూపాలని సూచిం చారు. అంతకుముందు విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమా ధానాలు రాబట్టారు. వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయాలని, మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బాత్‌రూమ్‌లు, తాగునీటి ట్యాప్‌లు, పరిసరాలను పరిశీలించారు.



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ముగిసిన గ్రంథాలయ **వారోత్సవాలు** 8లో

- విజేతలకు బహుమతుల ప్రదానం

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- పారిశుధ్యం, పార్కుల నిర్వహణపై అలసత్వం వద్దు
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం, పార్కుల నిర్వహణపై పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం నర్సిపురంలో పర్యటించారు. ఆ గ్రామంలో పార్క్ పరిస్థితిని చూసి అసహనం వ్యక్తం చేశారు. బెంచీలు విరిగిపోయి ఉండగా.. ప్లాస్టిక్ సీసాలను చూసి మండిపడ్డారు. పార్క్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యంను ఆదేశించారు. గ్రామ పరిశుభ్రతపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ● బెలగాం: పార్వతీపురం పట్టణంలోని పార్కులను మరింత అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం చర్చివీధిలోని పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ వాసులకు పచ్చని, ఆహ్లాదకరమైన వాతావర ణాన్ని అందించేలా పార్కులను అభివృద్ధి చేయాలని ఆదేశిం చారు. మొక్కలు పెంపకానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉండాలని, పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



నర్సిపురం పార్క్‌లో పారిశుధ్య లోపంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

నేడు డీఆర్‌సీ సమావేశం

- హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- సమస్యలు పరిష్కారమయ్యేనా?

పార్వతీపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అభివృద్ధి సమీక్ష మండలి(డీఆర్‌సీ) సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నా యుడు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఇతర శాఖల అధికారులు హాజరు కానున్నారు. కాగా కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండోసారి నిర్వహిస్తున్న ఈ సమావేశం సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని జిల్లా వాసులు ఆకాంక్షిస్తున్నారు.




ప్రధాన సమస్యలివీ..

కొమరాడ మండలంలో పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణంపై దృష్టి సారించాల్సి ఉంది. నిధులుండీ పనులెందుకు జరగడం లేదనే దానిపై చర్చించాలి. అదేవిధంగా సీతంపేట, పార్వతీ పురంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు త్వరగా పూర్తిచేసి వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి. పార్వతీపురం, సాలూరు ప్రభుత్వాసుపత్రుల్లో రేడియాలజిస్టులు, కార్డియాలజిస్ట్ పోస్టులు మంజూరు చేయాలి. బెడ్ల సంఖ్య పెంచాలి. పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, వట్టిగడ్డ తదితర ప్రాజెక్టుల వద్ద గతంలో జైకా నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లా నుంచి ఏనుగులను తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. పై సమస్యలపై చర్చించి మన్యం అభివృద్ధికి తగిన నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఈసారైనా వస్తారా?

- మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పదకొండు దుకాణాలకు 25న వేలంపాట
- గత మూడేళ్లలో ఇరవై సార్లు నిర్వహణ
- అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు చర్యలు
- అయినా ముందుకు రాని పాటదారులు

పార్వతీపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పదకొండు దుకాణాల పరిస్థితేమిటో అర్థం కావడం లేదు. వాటిని అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు గత మూడేళ్లుగా సుమారు 20 సార్లు అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. అయినా ఎవరూ ముందుకు రాకపోవడం వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా 2008లో 50 షాపులతో మున్సిపల్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అందులో ఒకటి మున్సిపల్ ప్రజారోగ్యశాఖ అధికారులు వినియోగిస్తున్నారు. మిగతా దుకాణాలను లీజు, అద్దె ప్రాతిపదికన పాటదారులకు కేటాయించారు. అయితే షాపింగ్ కాంప్లెక్స్‌లో 22, 23, 30, 32, 34, 35, 36, 40, 44, 46, 48 దుకాణాలకు సంబంధించి గత మూడేళ్లుగా బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదు. 2022 నుంచి ఇప్పటివరకు ఆయా షాపులు ఖాళీగా ఉన్నాయా..! లేవా..? అన్నది రెవెన్యూ అధికారులకే ఎరుక. గత వైసీపీ ప్రభుత్వంలో 11 షాపుల్లో కొన్నింటిని అప్పటి ప్రజా ప్రతినిధులు తమ అను యాయులకే ఇచ్చినట్లు సమా చారం. అక్కడ వరకు బాగానే ఉందనుకుంటే ఖాళీగా ఉన్నాయని చూపిస్తున్న షాపులను కొంతమంది తమ సొంత వ్యాపారాలకు గోడౌన్‌లుగా వాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదేమైనా గత మూడేళ్లుగా పదకొండు షాపుల నుంచి మున్సిపాల్టీకి రావాల్సిన ఆదాయానికి గండి పడింది. దీనికి కారకులు ఎవరనేది? అధికారులు, పాలకవర్గమే గుర్తించాల్సి ఉంది. కాగా షాపింగ్ కాంప్లెక్స్ చుట్టూ ఆక్రమణలు పెరిగిపోవడం, పారిశుధ్యం క్షీణించడం, నిత్యం దుర్వాసన వెలువడడం తదితర కారణాల వల్లే ఆ షాపుల వేలం పాటకు ఎవరూ ముందుకు రావడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మరోవైపు షాపుల నిర్వహణ అట కెక్కింది. పెచ్చులు ఊడిపోయి దుకాణాలు అధ్వాన స్థితికి చేరడం కూడా (మిగతా 8వ పేజీలో...)



పార్వతీపురం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

అన్నదాతలూ.. జాగ్రత్త

- రేపటి నుంచి 27 మధ్య తుఫాన్ వచ్చే అవకాశం
- పంటలు కాపాడుకోవాలని వ్యవసాయశాఖ సూచన
- రైతుల్లో ఆందోళన

6లో



ఆరోగ్య సర్వేలను **పక్కాగా చేపట్టండి** 8లో

చోరీ కేసులో **వార్డు బాయ్ నిందితుడు**

నేడు పోలిపాడ్యమి



- సముద్ర, నదుల్లో పుణ్యస్నానాలు
- నేటితో ముగియనున్న కార్తీక మాసం

విజయనగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో పోలి పాడ్యమి పురస్కరించుకుని శుక్రవారం సముద్ర, నదుల్లో ప్రత్యేక స్నానాలకోసం ఏర్పాట్లుచేస్తున్నారు. భక్తులు స్నానామాచరించి అరటి దవ్వల్లో దీపాలను వదలనున్నారు. గతనెల 21న ప్రారంభమైన కార్తీకమాసం పోలి పాడ్యమితో ముగియనుంది.

ప్రాశస్త్యం ఇది..

వ్యాస మహర్షి రచించిన స్కంద పురాణం ప్రకారం కార్తీకమాసం చివరి రోజైన అమావాస్య తర్వాత రోజునే పోలిపాడ్యమిని జరుపుకొంటారు. కార్తీక మాసంలో శివ-కేశవలను ఆరాధిస్తే, సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. పాడ్యమినాడు నిర్వహించే పోలిపాడ్యమిని పోలి స్వర్గమని అంటారు. ఈ రోజున దీపాధారణ చేయడం, నదులు, చెరువుల్లో, సముద్రంలో దీపాలను వదలడం వంటివి చేస్తారు. ఈ రోజే పోలి బొందితే స్వర్గానికి వెళ్లిన రోజని స్కందపురాణం చెబుతోంది.

పోలి స్వర్గం

ఓ రజక స్త్రీకి నలుగురు కొడుకులు, కోడళ్లు ఉన్నారు. ఆమె కార్తీక బహుళ అమవాస్య నుంచి ఆ నెలంతా ముగ్గురు కోడళ్ల తోడుగా నది స్నానానికి వెళ్లి దీపం పెట్టి వస్తుండేది. చిన్న కోడలే ఇంటి చాకిరి చేస్తుండేది. ఆమెకు పనులను అప్పగించి ముగ్గురు కోడళ్లతో ఆలయానికి వెళ్లి అత్త పూజలు చేస్తూ వచ్చేది. చిన్న కోడలు పోలికి నది స్నానం చేయాలన్న కోరిక ఉన్నా, పంపించేవారు కాదు. అయితే చిన్న కోడలు పోలి ఏ విధంగా నైనా దీపం పెట్టాలనుకుంది. వెన్న చిలికిన కవ్వానికి అంటుకున్న వెన్నను తీసి పెరటిలో మొలిచిన పత్తి కాడను తీసుకుని ఒత్తిగా చేసింది. బావి వద్ద స్నానం చేసి, దీపారాధన చేసింది. కైలాసం నుంచి చూసిన దేవదూతలు పోలీ కోసం విమానాన్ని తీసుకువచ్చారు. పోలి ఆ విమానాన్ని ఎక్కి బొందితో స్వర్గానికి వెళ్లిందని పురాణాలు చెబుతున్నాయి. ఇంత ప్రాశస్త్యం ఉన్న కథను చదవి సముద్ర, నది స్నానాలు ఆచరించి, భక్తితో శివయ్యను ఆరాధిస్తే, సకల పాపాలు, దోషాలు పోయి శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.



శివాలయం వీధిలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం

వంతెన లేక.. వానాకాలంలో పాట్లు

- దశాబ్దాల కల నెరవేరని వైనం
- చింతలగెడ్డ పొంగితే పది గ్రామాల ప్రజలకు తప్పని అవస్థలు

రాజాం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల లంలోని కంచరాం-కొత్త కంచరాం గ్రామాల మధ్య రుద్రసాగరం(చింతలగెడ్డ) గెడ్డపై వంతెన కలగా మారింది. ఇక్కడ వంతెన లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో పది గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. దశాబ్దాలుగా వంతెన నిర్మాణం కల నెరవేరని పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల్లో పెద్దగా ఇబ్బందులు లేకపోయినా వర్షాకాలం, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో చింతలగెడ్డ పొంగితే పది గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ వంతెన నిర్మించాలని దశాబ్దకాలంగా పది గ్రామాల ప్రజలు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారని పలువురు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలోని తెర్లాం తదితర ప్రాంతాల్లోని మిగులు జలాలు వర్షాకాలంలో పొంగిప్రవహిస్తుంటాయి. ఇక్కడ గొలుసుకట్టు విధానంలోని చెరువులను నింపే క్రమంలో రుద్రసాగరం, సారధిగెడ్డ విడిపోయి ప్రవహిస్తుంటాయి. సారధిగెడ్డ బీఎన్‌వలస, ఎంజేవలస, మారేడుబాక, కొత్తవలస, రాజాం, సారధి, అంతకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, సంతకవిటి మండలం మీదుగా పొందూరు మండలంలోని రెల్లిగెడ్డలో కలుస్తోంది. రుద్రసాగరంగా పిలవబడే చింతలగెడ్డ కంచరాం- కొత్త కంచరాం మధ్య నుంచి రేగిడి మండలంలోకి ప్రవహిస్తోంది. గతంలో బీటీ రహదారి నిర్మాణం సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గెడ్డపై వంతెనకు బదులు కాజ్‌వే నిర్మించి చేతులు దులుపుకొంది. దీంతో వర్షాకాలంలో చింతగెడ్డ పొంగి కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది.ఈ పరిస్థితుల్లో ఆగూరు, రామినాయుడువలస, దోసరి, అమరాం, కొత్త అమరాంతో పాటు బలిజిపేట మండలంలోని ఉద్దవోలు, సుందరాడ తదితర ప్రాంతాల నుంచి రాజాం వచ్చిపోయే వారి రాకపోకలు గెడ్డపొంగితే నిలిచిపోతున్నాయి. గత ఏడాది సెప్టెంబరు, ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు గెడ్డలో వరద ఉధృతికి పది గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలకు గురయ్యారు. దీంతో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారులు రంగంలోకి దిగాల్సివచ్చిన విషయం విదితమే. కాగా కంచరాం-కొత్త కంచరాం గ్రామాల మధ్య చింతలగెడ్డపై కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని కంచరాం, ఆగూరు, దోసరి, రామినాయుడువలస, అమరాం, కొత్త అమరాం, గడిముడిదాం, ఉద్దవోలు, సుందరాడ తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని టీడీపీ నాయకులు తెలిపారు.



చింతలగెడ్డ పొంగిపొర్లుతున్న దృశ్యం (ఫైల్)

తూడెంలో సాగర్ కవచ్

- మాక్‌డ్రిల్ నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు

భోగాపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూడెం సమీపంలో గురువారం పోలీసులు సాగర్‌కవచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్‌డ్రిల్ నిర్వహించి, బాంబులతో ఇద్దరు వ్యక్తలను పట్టుకొన్నట్లు సీఐలు కె.దుర్గాప్రసాదురావు, బీవీకే రాజులు తెలిపారు. సముద్రం నుంచి తీవ్రవాదులు చొరబడితే ఏ విధంగా పట్టుకోవాలో అన్న విషయంపై గురు, శుక్రవారాలు సాగర్ కవచ్ నిర్వహిస్తున్నారు. రెడ్‌ఫోర్స్ (కోస్టుగార్డ్సు) రహస్యంగా సముద్రం నుంచి సమీపంలోని గ్రామాల్లో చొరబడితే వారిని బ్లూఫోర్స్(మెరైన్, సివిల్ పోలీసులు)పట్టుకొనే విధంగా సాగర్‌కవచ్ చేపట్టారు. అయితే పోలీసుల నిఘా ఏ విధంగా ఉందో తెలుసుకోవడానికి డమ్మీ బాంబులతో ఐదుగురిని పంపించారు. వీరు భీమిలి మండలంలోని అవనాం మీదుగా తూడెం వైపు వస్తుండగా స్థానిక పోలీసులు వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని డమ్మీ బాంబులు స్వాధీనం చేసుకొన్నారు. అయితే వారిలో ముగ్గురు తప్పించుకోవడంతో సాగర్ కవచ్‌లో భాగంగా వారికోసం గాలిస్తున్నారు.



డమ్మీ బాంబులను పరిశీలిస్తున్న పోలీసులు

షటిల్ బ్యాడ్మింటన్‌కు ఉపాధ్యాయిని

కురుపాం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): లంకాజోడు గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన సోషల్ అసిస్టెంట్ రవ్వల గౌరీకుమారి జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి విజయవాడలోని డీఆర్ఎంసీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులు పోటీలకు ఆమె 50 సంవత్సరాల విభాగంగాలో ఆమె పాల్గొన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు లంకాజోడు పాఠశాల నుంచి ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు గౌరీకుమారి, లక్ష్మి పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో గౌరీకుమారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గౌరీకుమారి ఎంపిక కావడంపై లంకాజోడు పాఠశాల హెచ్‌ఎం ఎ.అరుణశ్రీ, సంక్షేమాధికారి టి.రేవతి అభినందనలు తెలిపారు.



రవ్వల గౌరీకుమారి

ముమ్మరంగా వాహన తనిఖీలు

కురుపాం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మావో కీలక నేత హిడ్మా మృతి చెందిన నేపథ్యంలో గురువారం ఏజెన్సీలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఎక్కడ ఎటువంటి అవంచనీయ సంఘటన జరగకుండా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అలాగే గురువారం జరిగిన వారపు సంతలో డ్రోన్ ద్వారా పరిశీలించారు. తనిఖీల్లో కురుపాం ఎస్ఐ నారాయణరావు, ట్రైనీ ఎస్ఐలు సాయికుమార్, కిరీటీ, సత్తిబాబు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అన్నదాతలూ.. జాగ్రత్త

- రేపటి నుంచి 27 మధ్య తుఫాన్ వచ్చే అవకాశం
- పంటలు కాపాడుకోవాలని వ్యవసాయశాఖ సూచన
- రైతుల్లో ఆందోళన

లక్కవరపుకోట/ గంట్యాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను చేసిన నష్టాల నుంచి రైతులు కోలుకోకముందే మరో తుఫాను హెచ్చరిక కలవర పరుస్తోంది. ప్రస్తుతం శ్రీలంకలో ఏర్పడి.. తమిళనాడు వైపు వస్తున్న అల్పపీడనం వల్ల ఇప్పటికే రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు ఈ నెల 22 నుంచి మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని... అది కోస్తా జిల్లాలకు విస్తరించనుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో వ్యవ సాయ శాఖ అధికారులు రైతులను అప్రమ త్తం చేస్తున్నారు. ఇప్పటికే పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఈ నెల 22 నుంచి 27 వరకు కోస్తా జిల్లాలకు వర్షాలు వస్తాయనే హెచ్చరికలతో వారు ఆందోళన చెందుతున్నా రు. ఇప్పుడిప్పుడే వరికోతలు మోదలు పెట్టారు. కొంతమంది రైతులు పొలాల్లోనే కుప్పలు పెడుతున్నారు. జిల్లాలోని 8 వ్యవసాయ సబ్ డివిజన్‌లలో గల 27 మండలాల్లో సుమారు 5 లక్షల 77 వేల ఎకరాల్లో రైతులు వరిపంట వేసినట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికే 5 లక్షల 25 వేల ఎకరాలకు ఈ క్రాప్ కూడా జరిగింది. నేటి వరకు 40 శాతం వరి పంట కోసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కొంతమంది రైతులు పొలాల్లోనే పంటను కుప్పలు వేస్తున్నారు. తుఫానుకు మరో మూడు రోజుల సమయం ఉన్నందున కోసిన పంటను సురక్షితంగా ఉంచుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. 'తుఫాను హెచ్చరిక ఉన్నందున ఈ నెల 22 నుంచి రైతులు కోతలు కోయవద్దు. కోసిన పంటను కుప్పలుగా వేయాలి. పచ్చిగా ఉంటే ఉప్పు ద్రావణం పిచికారీ చేసి కుప్పలు వేసుకోవాలని వ్యవసాయాశాఖ ఇన్‌చార్జ్ ఏడీ హరికృష్ణ తెలిపారు.



ఎల్.కోట: కోసిన పంటను కుప్పలు పెడుతున్న రైతులు



గంట్యాడ: నరవలో కోసిన వరిచేను

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వక్తలు తెలిపారు. గురువారం శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు పురస్కరించుకుని పలు పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.



శృంగవరపుకోట: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గుర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో ఎంఈవో భాను ప్రకాష్, కేవీ సూర్యనారాయణరాజు, కస్తూరిబా పాఠశాల ఎస్‌వో జానకి, ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు.

- నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జనాప్రసాద్ , డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్, రిటైర్డ్ ఆర్ఎస్ఐ బోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.
- శృంగవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శృంగవ రపుకోట శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, శాఖా గ్రంథాలయ అధికారి దామేదర శ్రీధర్, ఉపాధ్యాయుడు కాశీ విశ్వనాధం, డి.సూర్యారావు పాల్గొన్నారు.
- చీపురుపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను వినియోగించుకున్న వారు భవిష్యత్‌లో క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా తయారవుతారని ఎంపీడీవో ఐ.సురేష్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు పురస్కరించుకుని బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం. బూసినాయుడు, గ్రంథాలయాధికారి ఎం. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: బహుమతి ప్రదానం నిర్వహిస్తున్న దృశ్యం



నెల్లిమర్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా

భామిని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ జాస్బిత్‌సింగ్ అధికారులకు సూచించారు. గురువారం ఆస్పిరేషన్ బ్లాక్‌గా ఎంపికైన మనుమకొండ ఆదర్శ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. రైతులతో మాట్లాడి కేంద్ర, రాష్ట్ర పథకాల లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం భామినిలో నిర్వహిస్తున్న భవిత కేంద్రం, బొడ్డగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రాల నిర్వహణ తీరును ఐసీడీఎస్ పీవో శాంతి భవానీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతకుమారి, సర్పంచ్ ఎన్.కేశవ, అస్పిరేషన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ మహేశ్, జీసీసీ రాష్ట్ర డైరెక్టర్ నిమ్మల నిబ్రం పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

గొల్లలవలసలో జవాన్ అంత్యక్రియలు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మెరకముడిదాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవలస గ్రామానికి చెందిన జవాన్ అడ్డూరి దుర్గాప్రసాద్ అంత్యక్రియలు గురువారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన అడ్డూరి దుర్గాప్రసాద్ అసోం రైఫిల్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం పాలయ్యారు. ఆయన పార్థివదేహాన్ని గురువారం గ్రామానికి తీసుకొచ్చి, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, ఇన్‌చార్జి ఆర్డీవో ప్రమీలా గాంధీ, ఎస్ఐ జె.లోకేష్‌కుమార్, నాయకులు తాడ్డి సన్యాసి నాయుడు, కోట్ల మోతీలాల్ నాయుడు, చల్లా శ్రీరామ్ పాల్గొన్నారు.

సెస్ వసూలు కాక.. సౌకర్యాలు లేక

● శాఖా గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలు అందుబాటులోలేని వైనం ● ఇదీ గజపతినగరం మండలంలో పరిస్థితి

గజపతినగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల నుంచి గ్రంథాలయ సెస్సు బకాయిలు వసూలు కాకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోంది. ప్రధానంగా గ్రంథాలయాల్లో కనీస సౌక ర్యాలు కొరవడ్డాయి. పాఠకులకోసం తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు కూడా కల్పించని పరిస్థితినెలకొంది. ప్రస్తుతం కాంపిటేటివ్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు సైతం అందుబాటులో లేదు. పాత పుస్తకాలతోనే నెట్టుకురావాల్సివస్తోంది.స్థానిక శాఖా గ్రంథాలయానికి నిత్యం 60 నుంచి 70 మంది పాఠకులు వస్తుంటారు. అయితే వారికి అవసరమైన పుస్తకాలు అందజేసేందుకు సెస్సు బకాయిలు పేరుకుపోతున్నాయి. నేపథ్యంలో దాతలు ఇచ్చిన పుస్తకాలతోనే నెట్టుకు రావల్సివస్తోంది. మండలంలోని 30 పంచాయతీ నుంచి ఇంటి పన్ను నుంచి ఎనిమిది శాతం గ్రంథాలయానికి సెస్ రూపంలో చెల్లించాలి. ఏటా ఇంటిపన్ను కట్టించుకుంటున్న అధికారులు సెస్ కట్టేందుకు సుముఖత చూపడంలేదు.2019 నుంచి 2025 వరకు సెస్సువసూలు పూర్తిస్థాయిలో జరగలేదు.2018-19 సంవత్సరంలో గజపతినగరం పంచాయతీనుంచి 60వేలు మాత్రమే సెస్‌రూపంలో వచ్చినట్లు గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు. 2019-20, 2024-25 వరకూ సెస్ వసూలు కాలేదని స్థానిక గ్రంథాలయ అధికారులు చెబుతున్నారు. కాగా పంచాయతీల నుంచి గ్రంథాలయానికి రావల్సిన సెస్ బకాయిలు పేరుకుపోయాని గ్రంథాలయశాఖ అధికారి స్వప్న తెలిపారు. పంచాయతీ అధికారులు సకాలంలో స్పందించి సెస్ చెల్లించాలని కోరారు.


గజపతినగరం శాఖా గంథాలయంలో చదువుతున్న పాఠకులు

ప్రతి రోజూ తాగునీరందిస్తాం

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు ప్రతి రోజూ తాగునీరు పైప్‌లైన్ ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ కె.రామచంద్రరావు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో తాగునీరు ఇవ్వలేరా శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో కలెక్టర్ స్పందించారు.తాగునీటి సరఫరాలో ఎందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని కమిషనర్‌ను ప్రశ్నించారు.దీంతో అన్ని వార్డులకు పైప్‌లైన్ ద్వారా ప్రతి రోజూ తాగునీరందిస్తామని కమిషనర్ తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురైనా తక్షణమే పనులు చేయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు ప్రజాదర్బార్

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం అర్బన్, రూరల్, వంగర, సంతకవిటి, రేగిడి మండలాల నుంచి ప్రజలు సమస్యలు పరిష్కారానికి వినతి పత్రం అందజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దత్తిరాజేరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గర్భాం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా మండలంలోని అన్నిగ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ బి.రఘు ఒక ప్రకటనలో తెలిపారు.శుక్రవారంఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

24 వరకు డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

శృంగవరపుకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 24వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం హానర్స్, బీఏ ఎకనామిక్స్ బీఏ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లుతో వస్తే ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

గజపతినగరం,నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం శ్రామికులు ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏపీవో కృష్ణవేణి తెలిపారు. గురువారం మండలంలోని పురిటిపెంట, గంగచోళ్లపెంటల్లో ఉపాధిహామీపథకం పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించి ఈ-కేవైసీ నమోదు చేయనున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికిచేరాలని,మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రాజాం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళాభద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. సరదాగా ప్రారంభించి చివరికి అలవాటుగా మారి జీవితాలను నాశనం చేసే శక్తి మత్తుపదార్థాలకు ఉందని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గొట్లాంలో 'రచ్చబండ'

బొండపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లాంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్ పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాలు సేకరణ జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైసీపీ మండలాధ్యక్షులు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు కోరారు. సీతారామునిపేటలో ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు.

భూకబ్జాలపై ఫిర్యాదు

నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులు, భూకబ్జాలు, అక్రమ కేసులకు సంబంధించి ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు ఫిర్యాదు చేసినట్లు జైబీమ్‌రావు భారత పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతిని దులు కనిగిరి చిన్న మాలచ్చి, జగ్గారావు పాల్గొన్నారు.

రైతులకు మేలు జరిగేలా పాలన: కిమిడి


గరివిడి: వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

గరివిడి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలిస్తున్నారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. గురువారం మండలంలోని కోడూరు పంచాయతీలో వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సారిపాక సురేష్‌కుమార్, ఎలకల వెంకునాయుడు, సత్తిరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుచేసిన వెంటనే డబ్బుల జమ

గుర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కిమిడిరామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. తెట్టంగి పీఏసీఎస్‌లో సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా రామ్‌మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఏవో తిరుపతిరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, జమ్ము సొసైటీ అధ్యక్షులు మహేశ్వరరావు, పిల్ల అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు: అదితి

విజయనగరం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంధుల పాఠశాలలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. గురువారం విజయ నగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ మంగళవీధిలోని ప్రభుత్వ అంధుల పాఠశాలను పరిశీలించి, సదుపాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని సమస్యల పరిష్కారం కోసం ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు.అలాగే రాష్ట్ర ఎస్సీకమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను అదితిగజపతిరాజు గురువారం జడ్పీ అతిథిగృహంలో కలిశారు. నియోజకవర్గంలోని ఎస్సీలు, ఎస్సీ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు ఆయనకు వివరించారు.


ప్రభుత్వ అంధుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి: లోకం

డెంకాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాలు కల్పనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. గురువారం మండలంలోని బంటుపల్లిలో మన ప్రజలతో- మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జనార్దనరావు, సంఘం సురేష్, రవికుమార్, భవిరిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగమాధవి

ప్రజలకు సేవచేయండి: కోళ్ల


జామి: కార్యవర్గ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న లలితకుమారి

జామి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీలో పదవులు అంటే అనుభవించడానికి కాదని, ప్రజల్లోకి వెళ్లి వారికి సేవచేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. గురువారం జామిలో టీడీపీ మండలాధ్యక్షుడిగా వర్రి రమణ,కార్యదర్శిగా లగుడు రమణమ్మలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహకకార్యదర్శి రాంప్రసాద్, స్వామినాయుడు పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలను ఆచరించాలి

కొత్తవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని సాయి మందిరంలోసత్యసాయిబాబా జయంత్యుత్సవం పురస్కరించుకుని పూజలు చేశారు. అనంతరం ఆమె పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పీవీ రత్నాజీ, కోళ్ల వెంకరటమణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: బంగార్రాజు

భోగాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగవంశస్థుల సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. గురువారం మండలంలోని పోలిపల్లిలో బంగార్రాజును నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కాళ్ల సత్యవతి కలిశారు. ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కౌన్సిలర్ కళావతి పాల్గొన్నారు.


బంగార్రాజుతో మాట్లాడుతున్న సత్యవతి

బాస్కెట్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక

లక్కవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుబూడి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రవికుమార్ తెలిపారు. ఎంపికైన బిలపూడి కీర్తన, చుక్క హరిత, కె.జాషువాసుందర్ శుక్రవారం నుంచి నూజివీడులో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నగర పంచాయతీ జనసేన అధ్యక్షుడిగా నాని

నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షుడిగా రవ్వానాని, ఉపాధ్యక్షుడిగా జరజాపుపేటకు చెందిన ఎంఎం.నాయుడు, జనసేన యువత అధ్యక్షుడిగా రవికుమార్ నియమితులయ్యారు.ఈమేరకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి నియామక ఉత్తర్వులు జారీచేశారు.

'అక్షరాంధ్ర' విజయవంతం చేయాలి

నెల్లిమర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):అక్షరాంధ్ర కార్యక్రమాన్ని మెప్మాలో స్వయం సహాయక సంఘాలకు చెందిన విద్యావంతులైన మహిళలు విజయవంతం చేయాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని కోరారు. గురువారం నెల్లిమర్లలో మెప్మా సీఎంఎం గేదెల రాము ఆధ్వర్యంలో అక్షరాంధ్ర కార్యక్రమ బోధకులకు మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ టి.జైరామ్, మెప్మా సీఎంఎం గేదెల రాము, ఏఎంసీ డైరెక్టర్ ఎంఎం.నాయుడు, ఆర్పీలు, టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండశంభంలో గాయత్రీ మహా యజ్ఞం

గరివిడి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండశంభంలో గురువారం గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువకులు గొర్లె చిన్నంనాయుడు కార్తీకమాసం ముగింపు పురస్కరించుకునిరామాలయం వద్ద చీపురుపల్లి ఆర్యసమాజం వారితో గాయత్రీ మహాయజ్ఞం జరిపించారు.

కుష్ఠువ్యాధి లక్షణాలను గుర్తించాలి: డీపీఎంవో

కొత్తవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే గుర్తించాలని డీపీఎంవో అప్పలస్వామి సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించుకోవచ్చని చెప్పారు. గురువారం తుమ్మికాపల్లి, ముసిరాం, సీతంపేటలో కుష్ఠు వ్యాధిపై నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారితో కలిసి పరిశీలించారు.

బాల్యవివాహాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని బొబ్బిపురం వైసీబీ ఎన్‌జీవో సంఘం ప్రతినిధి డిపద్మ కోరారు. గురువారం బొద్దాంలో హెచ్ఎం గురుమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు స్వేచ్ఛగా జీవించే, రక్షణపొందే, అభివృద్ధి చెందేహక్కు ఉన్నాయని తెలిపారు.

డీఈవో మొండివైఖరి తగదు

రాజాం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలకు సెలవు దినం ప్రకటించుకునే అధికారాన్ని హెచ్ఎంలకు ఇచ్చే విషయంలో డీఈవో మొండివైఖరి ప్రదర్శించడం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సంఘ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలిపాడ్యమి వంటి పండగలకు సెలవు ప్రకటించకపోవడంతో హెచ్ఎంలు, విద్యార్థులు ఇబ్బందులుపడతారని పేర్కొన్నారు.

సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలి

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు కోరారు. గురువారం రాజాంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్ గైడ్‌లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు.

చెత్తలేకుండా చర్యలు తీసుకోవాలి: డీపీవో

గంట్యాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎక్కడా చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శికి జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున సూచించారు. మండలంలోని సిరిపురంలో పారిశుధ్యం పనులను గురువారం పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ఉన్నారు.


గంట్యాడ: సిరిపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న మల్లిఖార్జున

పథకాల్లో కోరినేషన్ చేయాలి

బొండపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రక్షితపథకాలను నిర్ణీత గడువులోగా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని జడ్పీ సీఈవో బి.సత్యనారాయణ కోరారు. గురువారం బోడసింగిపేటలో రక్షితమంచినీటి పథకంతో పాటు చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, జి.గిరిబాల, ఈవోపీఆర్‌డీ ఎ.రఘుపతి రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈఈ అలేఖ్య, సర్పంచ్ మీసాల జానకిరాం పాల్గొన్నారు.

పెద్దల భూముల్లో చెట్లు ఎందుకు తొలగించలేదు

ఎస్.కోట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ భూముల్లో పెంచుకుని, జీవనాధారంగా ఉన్న చెట్లను నరికించిన జిందాల్ యాజమాన్యం,పెద్దల భూముల్లో చెట్లు ఎందుకు తొలగించలేదని నిర్వాసితులు ప్రశ్నించారు. గురువారం మండలంలోని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితుల దీక్షలు 158వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల భూముల్లో ఉన్న ఒక్క చెట్టు కూడా ముట్టుకోలేదని తెలిపారు.

అనధికార లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు

● విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. గురువారం విజయనగరంలోని కేఎల్ పురం ప్రాంతంలో అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన లేఅవుట్ హద్దురాళ్లను ప్రణాళిక సిబ్బంది తొలగించారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న సిమ్మెంట్ పోల్స్, ఫెన్సింగ్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ ఏర్పాటుకు తప్పనిసరిగా ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. కొందరు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, అనధికారికంగా లేఅవుట్లు వేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.

ప్రజల సమస్యలు గుర్తించాలి

ప్రతి రోజు సచివాలయం పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య కోరారు. గురువారం నగరంలోని జమ్ము ప్రాంతంలో గల ఏడో నెంబరు సచివాలయంలో రికార్డులను, హాజరు పట్టీలను నల్లనయ్య పరిశీలించారు

సమయపాలన పాటించాలి

భోగాపురం, నవంబరు20(ఆంధ్రజ్యోతి):సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి కోరారు. గురువారం మండలంలోని బైరెడ్డిపాలెం సచావాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం రెడ్డికంచేరు పంచాయతీలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలని కార్యదర్శి, సిబ్బందికి సూచించారు. పోలిపల్లిలో హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

గజపతినగరం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎం.గుమడాం గ్రామానికి చెందిన గంట్యాడ అప్పలనాయుడు(54) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు.ఎస్ఐ కథనంమేరకు.. అప్పలనాయుడు మానసికస్థితి బాగోలేకపోవడంతో రెండేళ్లుగా పిచ్చి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మేడపైన పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు.పొలం నుంచి ఇంటికి వచ్చిన భార్య సత్యవతి చూడగా పురుగుల మందుసీసా ఉండడంతోచుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.ఈ మేరకు గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో మైక్‌సెట్ చోరీ

కొత్తవలస,నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపాలెం జంక్షన్‌లోగల ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం యాంప్లిఫైర్‌తోపాటు మైక్‌సెట్ చోరీకి గురయ్యాయి. గురువారం ఉదయం 5.45 నిమిషాలకు స్కూటీపై వచ్చిన ముగ్గురు ఆలయంలోకి వెళ్లి యాంప్లిఫైర్‌తోపాటు మైక్‌సెట్ పట్టుకుపోయినట్లు సీసీ కెమెరాలను పరిశీలించి గుర్తించారు. ఈమేరకు సీఐ షణ్ముఖరావు దృష్టికి గ్రామపెద్దలు ఈ విషయం తీసుకెళ్లారు. నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో 12 గొర్రె పిల్లల మృతి

వంగర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలగాంలో గురువారం కుక్కల దాడిచేయడంతో 12గొర్రెపిల్లలు మృతిచెందగా పది గాయపడ్డాయి. గ్రామానికి చెందిన పురబోతు సింహాచలం తన గొర్రె పిల్లలను ఇంటి వద్ద గల కొట్టంలో ఉంచి పొలం పనులకు వెళ్లాడు. ఇంతలో అక్కడ ఉన్న కుక్కలు కొట్టంలోకి చొరబడి గొర్రెపిల్లలపై దాడి చేశాయి. గొర్రెలు అరుపులతో అక్కడఉన్న వారు వచ్చి కుక్కలను చెదరగొట్టగా అప్పటికే 12 పిల్లలు మృతిచెందాయి. రైతు లబోదిబోమంటున్నాడు.

డ్రైవింగ్ స్కూల్ లైసెన్స్ సరెండర్

విజయనగరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల చట్టంలోని రూల్ 24 నుంచి 32లో పొందుపరిచిన ప్రకారం లేని డ్రైవింగ్ స్కూళ్లు మూసివేయనున్నట్లు రవాణాశాఖ ఉపకమిషనర్ మణికుమార్ తెలిపారు. ఇప్పటికే ఒకడ్రైవింగ్ స్కూల్ రద్దుచేశామని, మరో డ్రైవింగ్ స్కూల్ లైసెన్స్‌ని రవాణాశాఖ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు చెప్పారు. గురువారం జిల్లాలోని డ్రైవింగ్ స్కూళ్లలో రవాణాఅధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతలో భాగంగా ఇప్పటికే డ్రైవింగ్ స్కూళ్లకు గత ఏడాది నుంచి నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. డ్రైవింగ్‌స్కూల్స్ వాహనాలు, డాక్యుమెంట్లు సరిగ్గాలేవని వచ్చిన సమాచారంతో కలెక్టరు ఆదేశాలతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

విజయనగరం క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి గాను ఒక్కొక్కరికి ఐదు రోజులు చొప్పున జైలు శిక్ష విధిస్తూ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి మద్యం సేవించి వాహనం నడిపి డి.ఉమాశంకరరావు, కింతలి ప్రసాదరావు పట్టుబడడంతో కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు చెప్పారు.

మూడురోజుల జైలు..

రాజాం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాన్ని నడిపిన వ్యక్తికి మూడురోజులు జైలుశిక్ష విధిస్తూ రాజాం జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.నైమిష గురువారం తీర్పు వెలువరించారని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.సీఐ కథనం మేరకు.. పట్టణంలోని మల్లిఖార్జున కాలనీకి చెందిన తమ్మిరెడ్డి దుర్గాప్రసాద్ ఈనెల 18వ తేదీ రాత్రి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయనపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరచగా మూడు రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

కల్లేపల్లిలో ఆసుపత్రికోసం స్థల పరిశీలన

లక్కవరపుకోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లిలో ఆసుపత్రి నిర్మాణానికి గురువారం ఏపీ వైద్య సేవా మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారి నరేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ కార్యాలయ అధికారి స్థలాన్ని పరిశీలించారు. గతంలో కేటాయించిన స్థలం అనివార్య కారణాల వల్ల రద్దయింది. దీంతో ఆసుపత్రి నిర్మాణంలో జాప్యం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తర్వాత ఆసుపత్రి నిర్మాణం విషయంలో కదలిక వచ్చింది. రెవెన్యూ అధికారులు పరిశీలించి స్థలాన్ని అప్పగిస్తే ఆసుపత్రి పనులకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులు తయారు చేస్తారని ఇంజనీరింగ్ అధికారి హరి తెలిపారు. ప్రస్తుతం కల్లేపల్లిలో పంచాయతీ భవనంలో ఆసుపత్రి సేవలందిస్తోంది. కార్యక్రమంలో సర్పంచ్ ముసలినాయుడు,ఎంపీటీసీమాజీ సభ్యుడు జక్కాన కన్నబాబు, పీహెచ్‌సీ వైద్యులు అజయ్‌కుమార్, తేజ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై సైకిల్‌యాత్ర

కొత్తవలస, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):మాదక ద్రవ్యాల నిరోధంపై పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం పేరుతో నిర్వహిస్తున్న సైకిల్ యాత్రీకులకు గురువారం కొత్తవలసలో సీఐ షణ్ముఖరావు స్వాగతం పలికారు. ఈసందర్భంగా దెందేరులోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గంజాయి వాడకంపై కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కొత్తవలస వరకు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండలంలో అభ్యుదయ సైకిల్‌యాత్రను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గోనెసంచులను అందజేయాలి: తహసీల్దార్

గజపతినగరం, నవంబరు20(ఆంధ్రజ్యోతి):మిల్లుకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ బి.రత్నకుమార్ హెచ్చరించారు.గురువారం గజపతినగరం దిగువవీధిలో రైతు సేవా కేంద్రంలో మిల్లర్లు, వెలుగు సిబ్బంది, పీఏసీఎస్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన గోనె సంచులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● చీపురుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ డి.ధర్మరాజు ఆదేశించారు. గురువారం చీపురుపల్లిలో మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ నాగలక్ష్మి, ఏవో సూర్యకుమారి పాల్గొన్నారు.

ఆశాజనకంగా..!

(5వ పేజీ తరువాయి)

సంపదను ఈ ప్రాంతంలోనే ఎక్కువగా విక్రయిస్తుంటారు.

● తోటపల్లి ప్రాజెక్టుతో పాటు పార్వతీపురం చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో, పాలకొండ చెరువుల్లో లభ్యమయ్యే చేపలకు మంచి డిమాండ్ ఉంది. విజయనగరం జిల్లా మడ్డువలస రిజర్వాయర్ నుం చి తెచ్చే చేపలు, విశాఖ నుంచి వచ్చే సముద్రపు చేపలు జిల్లా కేంద్రంతో పాటు సాలూరు తదితర ప్రాంతాల్లోనూ భారీగా అమ్ముడ వుతుంటాయి.

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో..

● తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో ఏటా మత్స్యశాఖ సుమారు 2 లక్షలకు పైగా పలు రకాల చేప పిల్లలను విడిచి పెడుతుంది. అయితే పెంపకంపై మాత్రం శ్రద్ధ చూపడం లేదు. వరద ప్రవాహం ఎక్కువైన సమయంలో దిగువ ప్రాంతానికి, నీటి నిల్వలు తక్కువగా ఉంటే ఎగువ ప్రాంతానికి చేప పిల్లలు వెళ్లిపో తుంటాయి. ప్రాజెక్టులో పేరుకుపోయే గుర్రపు డెక్క, పిట్ట తామర కారణంగా అధికంగా చేపలు మృతి చెందుతున్నాయి. దీంతో మత్స్య కారులకు అంతంతమాత్రంగానే మత్స్య సంపద లభ్యమవుతుంది.

● గతంలో శ్రీవెంకటేశ్వర తోటపల్లి (ఆర్అండ్ఆర్) గిరిజన ఇన్‌లాండ్ మత్స్యకార సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో ముంపునకు గురైన గిరిజన మత్స్యకార కుటుంబాలు ఈ సంఘం పరిధిలో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తుంటాయి. సొసైటీ పరిధిలో సుమారు 10 గ్రామాలకు సంబంధించి 200లకు పైగా మత్స్యకార కుటుంబాలున్నాయి. కోటవానివలసలో సుమారు 120 కుటుంబాలకు చేపల వేటే ఆధారం. ప్రాజెక్టులో బొచ్చులు, రా గండి, ఎర్రమైలు, కొర్రమీన, గొరసలు, మోసులు వంటి చేపలతో పాటు సీజన్ వారీగా రొయ్యలు కూడా లభ్యమ వుతాయి.

● ప్రాజెక్టులో లభ్యమయ్యే చేపలను పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పాలకొండ మండలాలతో పాటు పరిసర గ్రామా లకు రోజువారీ 1500 కిలోలకు పైగా వివిధ రకాల చేపలను రవాణా చేస్తుంటారు. బొచ్చులు కిలో రూ.100, గొరసలు రూ.60, కొరమీనలు రూ. 200, రొయ్యలు కిలో రూ.350 చొప్పున విక్రయిస్తుంటారు. మొ త్తంగా ఈ ప్రాంతంలో నెలవారీ లక్ష కిలోల వ్యాపారం జరుగుతుంది.

సహకారం అంతంతమాత్రమే..

తోటపల్లి ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా మత్స్య సంపద మాత్రం తక్కువగానే లభ్యమ వుతుంది. అధికారుల సహకారం అంతంతమాత్రమే. దీంతో చిన్నపాటి కాలువలు, చెరువుల్లో చేపలు పట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది. గిరిజన మత్స్యకారుల అభివృద్ధికి ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

- ఈదల తిరుతిరావు, మత్స్య సంఘం అధ్యక్షుడు, కోటవానివలస

గుర్రపు డెక్కను తొలగించాలి

తోటపల్లి ప్రాజెక్టులో ఎప్పటికప్పుడు పేరుకుపోతున్న గుర్రపు డెక్క, పిట్ట తామరను తొలగించాలి. ఇక్కడ మత్స్య సంపదను పెంచేందుకు మత్స్యశాఖ, ఐటీడీఏ అధికారులు చొరవ చూపాల్సి ఉంది. **- ఈదల నాగరాజు, మత్స్యకారుడు, కోటవానివలస**

సద్వినియోగం చేసుకోవాలి

డీఏజేజేయూఏ పథకం ద్వారా సబ్సిడీతో ఐస్‌బాక్సులు, బోట్ సెట్స్ ఐస్‌బాక్సులతో కూడిన బైక్‌లు అందిస్తున్నాం. ఆక్వా భరోసా ద్వారా చేపల ఉత్పత్తికి సంబంధించి విద్యుత్ వినియోగంపై సబ్సిడీ వరి స్తుంది. ఎఫ్ఎస్‌పీవో ఆర్థిక సహకారంతో మత్స్య పారిశ్రామిక సహ కార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.9 లక్షలను మంజూరు చేసింది. మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వాటిని జిల్లా మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి.

- సంతోష్, జిల్లా మత్స్యశాఖాధికారి

పక్కాగా భూముల రీసర్వే

(5వ పేజీ తరువాయి)

సంబంధిత రైతులకు సమాచారం అందించాలన్నారు. వారి సమక్షంలోనే ఈ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. నెంబర్ల వారీగా సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని, ఆ విషయాలను రైతులకు పూర్తిస్థాయిలో వివరించాలని సూచించారు. ● సీతంపేట రూరల్: గజిలి గ్రామ సమీపంలో చేపడుతున్న భూ రీసర్వేను కూడా ఆయన పరిశీలించారు. భూముల కొలతలను పరిశీలించి పలు సూచనలు చేశారు. భూ తగాదాలు తలెత్తకుండా గ్రామాల్లో ఉన్న రైతులకు సభలు నిర్వహించి సర్వే సక్రమంగా పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఏడీ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ఈసారైనా వస్తారా?

(5వ పేజీ తరువాయి)

మరో కారణంగా తెలుస్తోంది. షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతులకు రూ.20 లక్షలు వెచ్చించాలని రెండు నెలల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

25న నిర్వహణకు సన్నద్ధం

షాపింగ్ కాంప్లెక్స్‌లో పదకొండు దుకాణాలకు సంబంధించి ఈనెల 25న బహిరంగ వేలం పాట నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మరి ఈసారైనా పాటదారులు ముందుకొ స్తారా? లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది. దీనిపై మున్సిపల్ రెవెన్యూ అధికారి రూబేనూను వివరణ కోరగా.. ' మున్సిపల్ కాంప్లెక్స్‌లోని షాపుల నుంచి ఆదాయాన్ని తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. అయితే పదకొండు షాపులకు సంబంధించి పాటదారులు ఎందుకు రావడం లేదనేది? అర్థం కావడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్ చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించాలని, పారి శుధ్యం మెరుగు పర్చాలని, రూ.20 లక్షలతో దుకాణాలకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా కోరాం. అయినా ఆయా శాఖలు స్పందించకపోవడం బాధాకరం.' అని తెలిపారు.

ఇసుక రీచ్‌కు వెళ్లకుండా రహదారి ధ్వంసం

కొమరాడ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కూనేరు, రామభ ద్రపురం ఇసుక రీచ్‌కు అ క్రమంగా ఏర్పాటు చేసిన రహదారి కొమరాడ తహశీల్దార్ సీహెచ్.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో గురువారం ధ్వంసం చేశారు. ఇసుక రీచ్‌కు వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం సాయంత్రం పెదమరికిలో రూ.26 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీ ప్రకారం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు తీసుకువచ్చానన్నారు. వరహాలు గెడ్డ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించానన్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, బోను దేవీ చంద్రమౌళి, గుంప స్వామి, ఎం.సత్యనారాయణ, డాక్టర్ భానుప్రసాద్, జాగాన రవి, జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో మెలగండి

పార్వతీపురం రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు అందరూ సమన్వయంతో మెలగాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీతానగరం మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద పి.చాకరాపల్లి, అజ్జాడ గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసుకున్న ఆటోస్టాండ్‌లో మా ఆటోలను నిలపవద్దని అంటున్నారన్నారు. దానివల్ల మా జీవనాధారం పోతోందన్నారు. అక్కడ మా ఆటోలు నిలుపుదల చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. అందుకు సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన విజయచంద్ర

పార్వతీపురం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఎట్టణంలోని బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన ప్యాలెస్‌లో షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్‌ను గురువారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. మొదటిసారిగా మన్యం జిల్లాకు విచ్చేసిన ఆయన్ని ఘనంగా సత్కరించారు.

నేడు జిల్లాలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

పార్వతీపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 11 గంటల వరకు పార్వతీపురం ఐటీడీఏలో షెడ్యూల్డ్ కుల సంఘాల ప్రతినిధులను ఆయన కలుస్తారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. ఆ తర్వాత కలెక్టరేట్‌కు చేరుకుంటారని, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఆయన జిల్లాకేంద్రంలో ఉంటారని వెల్లడించారు.

సర్వేలను పక్కాగా చేపట్టండి



రికార్డులు పరిశీలిస్తున్న డా.జగన్మోహన్‌రావు

పార్వతీపురం రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): వ్యాధి లక్షణాలు గుర్తింపునకు ఆరోగ్య సర్వేలను పక్కాగా చేపట్టాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సూచించారు. గురువారం ఆయన బాలగుడబ హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీలు, సర్వేల రికార్డులు, ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. రక్తపోటు, మధుమేహం, హృద్రోగ సమస్యలతో పాటు క్యాన్సర్ లక్షణాలు గుర్తించడంలో శ్రద్ధ వహించాలన్నారు. కార్య క్రమంలో సీహెచ్‌వో జగదీశ్, ఏఎన్ఎం స్వాతి ముత్యం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీ కేసులో వార్డు బాయ్ నిందితుడు

విశాఖపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం విశాఖ పట్నంలోని వెంకోజీపాలెం మెడికవర్ ఆసుపత్రిలో ఈసీజీ తీయించుకున్న ఓ మహిళ మెడలోని గొలుసు మాయమైన కేసులో ఎంవీపీ పోలీసులు వా ర్డు బాయ్‌ను గురువారం అరెస్టు చేశారు. ద్వారకా జోన్ నేర విభాగం సర్కి ల్ ఇన్‌స్పెక్టర్ వి.చక్రధరరావు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 16న రు క్మిణి అనే మహిళ అనారోగ్యంతో మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. అదే రోజు రాత్రి రోగిని ఈసీజీ పరీక్ష కోసం తీసుకువెళ్లగా, పరీక్ష అనంతరం రుక్మిణి మెడలోని 28 గ్రాముల బంగారు గొలుసు మాయమైంది. ఫిర్యాదు అందుకు న్న ఎంవీపీ పోలీసులు ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో చురుగ్గా దర్యాప్తు చే శారు. వివిధ సీసీ ఫుటేజీల పరిశీలన అనంతరం వార్డు బాయ్‌గా పనిచే స్తున్న సువ్వాన త్రినాథ్(51) గొలుసు చోరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. నిందితుడు పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం జగన్నాథ పురం గ్రామంలోని కనకంవీధి వాసి. విశాఖపట్నంలోని అప్పుఘర్ దరి ము వ్వలవారి వీధిలో నివాసం ఉంటున్నాడు. నిందితుడి నుంచి బంగారం రికవ రీ చేసి రిమాండుకు తరలించారు.

సఫాయి కర్మచారి యువత ఉపాధికి చర్యలు

పార్వతీపురం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు మూడు సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహ నాలను సబ్సిడీ మంజూరు చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఈడీ వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం యూనిట్ విలువ రూ.31,67,326గా నిర్ణయించారన్నారు. ఆసక్తిగలవారు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

జీసీసీకి ఉత్పత్తులను విక్రయించండి

సాలూరు, నవ oబరు20 (ఆంధ్రజ్యోతి): జీసీసీ ప్రతినిధులకు ఉత్పత్తు లను విక్రయించాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ రమేశ్‌కుమార్ గిరిజ నులకు సూచించారు. నేరెళ్లవలస, కురుకూటి ప్రాథమిక కొనుగోలు కేంద్రా ల పరిధిలోని ఎగువ సెంబీ గ్రామంలో ఆయన గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దళారీలను నమ్మి మోస పోవద్దని ఆయన హితవు పలికారు. జీసీసీ ఇన్‌చార్జి మీ గ్రామంలోకి వచ్చి ప్రభుత్వం నిర్ణయిం చిన ధరలకు ఉత్పత్తులను కొనుగోలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిలు మహేష్, సింహాచలం ఉన్నారు.

విలేకరులకు ఆరోగ్య పరీక్షలు

బెలగాం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేస్తున్న విలేకరుల ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టామని కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం డీసీహెచ్ నాగభూషణరావు సహకారంతో మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో మెడికల్, సర్జికల్, ఆర్థో, నేత్ర, దంత, ఈసీజీ, అల్ట్రా సౌండ్ పరీక్షలను ఉచితంగా చేపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డాక్టర్ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శివనాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి రైతుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న పాపంపేట రైతులు

వీరఘట్టం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): వండువ, పాపంపేట గ్రామస్థులు గురువారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అన్నదాత సుఖీభవ నిధులు రెండో విడతలో కలిపి తమ ఖాతాల్లో రూ.10 వేలు జమ అవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తమ సమస్యను డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఫలితంగానే మాకు ఈ నిధులు అందాయని రైతులు తెలిపారు. అందుకు ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా యువజన దినోత్సవం



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకొండ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి మందిరంలో యువజన దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని 75 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సాయంత్రం మహానగర సంకీర్తన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించండి

సీతానగరం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు, షాపుల యజమానులు సహకరించాలని ఎస్ఐ ఎం.రాజేశ్ కోరారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, వర్తకులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుభవం లేకుండా డ్రైవింగ్ చేయడం, ప్రధాన రహదారుల్లోని షాపులకు వచ్చేవారు వాహనా లను రోడ్డుకు అడ్డంగా నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించా మన్నారు. షాపు యజమానులు సైతం వాహనాల పార్కింగ్‌కు ఏరాట్లు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు రోడ్డుకు ఇరు వైపులా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

సాలూరు, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది కార్యాలయానికి వచ్చేటపుడు ప్లాస్టిక్ సీసాలలో తాగునీరు తీసుకురావద్దన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని నివారించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు

సీతానగరం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీనృసింహస్వామికి భక్తులు గురువారం ముడుపు ల పూజలను నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూ జలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

పనులు చేయనివారి జాబ్‌కార్డుల తొలగింపు

సీతానగరం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేపట్టని వారి జాబ్ కార్డులను తొలగించామని ఏపీవో బాలకృష్ణ తెలిపారు. గురువారం జాబ్‌కార్డులు తొలగిం చిన వారి జాబితాను పంచాయతీ కార్యాల యా ల్లో అందుబాటులో ఉంచారు. ఈ సంద ర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనదారుల్లో కొందరు మృతి చెంద డం, మరికొందరు దీర్ఘకాలిక వలసలు వెళ్లిన నేప థ్యంలో వారి జాబ్ కార్డులను తొలగిం చామ న్నారు. కొత్తగా జాబ్‌కార్డులు కావల్సిన వారు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బైక్‌ల దొంగ అరెస్టు

● ఐదు వాహనాలు స్వాధీనం



బైక్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసిన తోట ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.రాంబాబు మాట్లాడారు. తోట ప్రసాద్ మద్యానికి, ఇతర వ్యసనాలకు బానిసై తన సంపాదన అవసరాలకు సరిపోకపోవడంతో మోటార్ సైకిల్ దొంగతనాలకు అలవాటు పడ్డాడన్నారు. పాలకొండ పట్టణంతో పాటు శ్రీకాకుళం జిల్లా జలుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగాధరపేటలో ఐదు మోటార్‌సైకిళ్లను దొంగతనం చేశాడని వివరించారు. గురువారం పట్టణంలోని ఏలాం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తోట ప్రసాద్ శ్రీకాకుళం వైపు నుంచి పాలకొండ వైపు వస్తుండటాన్ని గుర్తించి వాహనాన్ని ఆపి పరిశీలించామన్నారు. ఆ వాహనం పాలకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన వాహనంగా గుర్తించా మన్నారు. దాంతో ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా పాలకొండ పట్టణంలో నాలుగు మోటార్‌సైకిళ్లను, జలుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగతనం చేసినట్టు అంగీకరించాడన్నారు. పాలకొండ మండలం వెలగవాడ పరిసరాల్లోని తుప్పల్లో ద్విచక్ర వాహనాలను ఉంచినట్టు తెలిపాడన్నారు. నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని తోట ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.

బంగారు ఆభరణాల రికవరీ

పాలకొండ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాంద్రంకి వీధికి చెందిన వృద్ధురాలు సాహిని హైమవతికి చెందిన బంగారు ఆభరణాలను పోలీ సులు గురువారం రికవరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఈ నెల 15న హైమవతికి చెందిన బంగారం చోరీకి గురైంది. దాం తో ఆమె పాలకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇంటి సమీపంలో సీసీ కెమెరా ఫుటేజీ ఆధారం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆమె మనుమడు సాయికృష్ణ.. ఇంటిలో సూట్‌కేసులో ఉంచిన రెండున్నర తులాల హారం, పావు తులం శతమానాలను దొంగిలించినట్టు పోలీసులు గుర్తించారు. దాంతో గురువారం ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తానే నాన్నమ్మ ఇంటిలో బంగారం ఆభరణాలను దొంగించి నట్టు అంగీకరించాడు. దాంతో ఆ యువకుడి నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేసి కోర్టుకు తరలించారు. డీఎస్పీ ఎం.రాంబాబు, బం గారం చోరీ కేసును సకాలంలో చేధించిన సీఐ ప్రసాదరావు, ఎస్ఐ ప్రయోగమూర్తిలను డీఎస్పీ రాంబాబు అభినందించారు.

నాగావళిలో వృద్ధుడి గల్లంతు

కురుపాం రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): బియ్యాలవలస గ్రామా నికి చెందిన మండంగి అన్నపురాయుడు (65) గురువారం నాగావళి నదిలో గల్లంతయ్యాడు. పార్వతీపురంలో జరిగే వారపు సంతకు వెళ్లి పశు వులు కొనుగోలు చేసి మండంగి అన్నపురాయుడు, అడ్డాకులు రామ్మూర్తి కలిసి వస్తూ, కళ్లికోట-దళాయిపేట రేవుల మధ్య వరద ప్రవాహానికి ఇద్దరూ కొట్టుకుపోయారు. ఆ సమీపంలో ఉండేవారు రామ్మూర్తి, పశువులకు కాపాడారు. అన్నపురాయుడు నదిలో కొట్టుకుపోయారు. ప్రమాద విష యం తెలియడంతో సంగెడ్డ, బియ్యాలవలస, సింగుపురం గ్రామాలకు చెందినవారు నాగావళి తీరం వెంబడి వెతికారు. ఎక్కడా ఆయన ఆచూకీ దొరకలేదు. దాంతో అన్నపురాయుడు బావమరిది తోయక తమ్మయ్య కొమరాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

సీతంపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువదారబ గ్రామ సమీపంలో గురువారం ఎస్ఐ అమ్మనరావు, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటలను గుర్తించారు. దాన్ని వారు ధ్వంసం చేశారు. అలాగే సారా వంటకాలు, సారా నిల్వకు వినియోగించే ప్లాస్టిక్ టబ్బులను స్వాధీనం చేసుకున్నారు. సారా వంటకాలు, విక్రయాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. దాడుల్లో ట్రైనీ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాపౌట్ పిల్లల ఇళ్లకు ఉపాధ్యాయులు

పాలకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం దాసరి నాగభూషణం, సంస్కృత పండితుడు బౌరోతు శంకరరావు గురువారం ఓని గ్రామాన్ని సందర్శించారు. డ్రాపౌట్ పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలకు రాకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. పిల్లలను పాఠ శాలకు పంపించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠ శాలకు వచ్చి అప్పుడప్పుడు పిల్లల స్థాయిని తెలుసుకోవాలని సూచించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



పాలకొండ: మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు

పాలకొండ, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహి స్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్యాంబాబు మాట్లాడుతూ వారోత్స వాలు నిర్వహించడం వల్ల ప్రజలు, విద్యార్థుల్లో పుస్తక పఠనం ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూ ఏసీ కో-ఆర్డినే టర్ బి.రాజు, గ్రంథాలయ విభాగాధి పతి ఉమా సోమిత్‌రాజుపాల్గొన్నారు.

●సాలూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ అప్పలనాయుడు, వేద సమాజం సంస్కృత పాఠశాల హెచ్ఎం టి.నాగేశ్వరరావు, రిటైర్డ్ టీచర్ అప్పారావు పాల్గొన్నారు.

●సీతంపేట రూరల్: గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని ఎంఈవో ఎం.ఆనందరావు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహు మతులను అందజేశారు. అనంతరం రిటైర్డ్ గ్రంథాలయ అధికారి శ్రీరాములును సత్కరిం చారు. కార్యక్రమంలో సీతంపేట గ్రంథాలయా. ధికారి బి.గణేష్, హైస్కూల్ హెచ్ఎం వెంకటరావు పాల్గొన్నారు.

●పాచిపెంట: గ్రంథాలయాల ద్వారా పాఠకులు పఠనా శక్తిని పెంపొందించు కోవాలని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. గురు వారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్స వాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఉదయ్‌భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు దండి ఏడుకొండలరావు, ఎంఈవో పి.సతీష్, సర్పంచ్ పి.సంతోషి, రిటైర్డ్ టీచర్లు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీవో జి.పైడితల్లి, ఎంఈవో జోగారావు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథ నిర్వాహకులు ఎన్.మధుసూదనరావు, కె.మాధవి, హెచ్ఎం ఎం.తేజస్వి, సాయి నికేతన్ హెచ్ఎం పి.సదాశివం పాల్గొన్నారు.